## క్లుప్తంగా

### బసవేశ్వర స్వామికి విశేష పూజలు



బసవేశ్వర స్వామి

**కోసిగి:** మండల కేంద్రం కోసిగిలోని బసవన్న కొండపై వెలసిన శ్రీ బసవేశ్వర స్వామికి విశేష పూజలు చేపట్టారు. బుధవారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జామున నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని నారికేలలు సమర్పించి పూజలు చేసుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

### ఆలయాల్లో అమావాస్య పూజలు



భద్రకాళిసమేత వీరభద్రేశ్వరస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

**ఆదోని అర్బన్:** పట్టణంలోని ఆలయాల్లో బుధవారం అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. స్థానిక భద్రకాళిసమేత వీరభద్రేశ్వరస్వామి వారికి పంచామృతాభిషేకం, పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా శంభులింగేశ్వరస్వామి ఆలయంలో జ్యోతిర్లింగ పడిపూజ చేశారు. ఎమ్మిగనూరు రోడ్డులోని గంగాభవాని ఆలయంలో శివలింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేగాకుండా ఎల్‌బీ స్ట్రీట్, మట్కారీవీధిలో వెలిసిన ఉరుకుంద ఈరన్న, కోటనగర్‌లోని చంద్రమౌళేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### బాలికల హైస్కూల్‌లో డ్రైనేజీ నిర్మాణానికి సహకారం



బాలికల హైస్కూల్ ఉపాధ్యాయులతో రిటైర్డ్ ఐజీ

**ఎమ్మిగనూరుటౌన్:** పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రిటైర్ ఐజీ ఇక్బాల్ హామీ ఇచ్చారు. బుధవారం ఆయన పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయినులు ఆయనకు డ్రైనేజీ సమస్యను వివరించారు. దీంతో స్పందించిన ఆయన సొంతంగా రూ.6లక్షలు వెచ్చించి 15 రోజుల్లోగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

### దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

**కౌతాళం:** మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో బుధవారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ ప్రాంతా నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలను సమర్పించారు. బుధవారం అమావాస్య కావడంతో భక్తులు మంగళవారం సాయంత్రం నుంచే తరలివచ్చారు. తెల్లవారు జామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు.

### విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న మీటర్ రీడర్లు

**ఎమ్మిగనూరుటౌన్:** విద్యుత్ శాఖలో పని చేస్తున్న మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ సంఘ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ జి.నరసింహారెడ్డి, డివిజన్ నాయకుడు ఉరుకుందు, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఏపీ విద్యుత్ మీటర్స్ రీడర్స్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏడీఈ నాగేంద్రప్రసాద్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ.. విద్యుత్ మీటర్ రీడర్లకు ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం కాంట్రాక్టర్ ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ మీటర్ రీడర్స్ సంఘ నాయకులు ఎం.నరసన్న, చంద్రశేఖర్, భీమేష్, కిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంకెప్పుడిస్తారు?

- పదిలో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యాశాఖ వందరోజుల ప్రణాళిక
- ఇప్పటి వరకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయని వైనం
- వంద రోజుల్లో మిగిలింది 42 రోజులే..
- స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ఉపాధ్యాయ సంఘాలు
- వాటితోనే విద్యార్థుల సాధన



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

**ఆదోని సెంట్రల్:** విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలను సాధించేందుకు విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది. అయితే విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ మాత్రం పంపిణీ చేయలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సకాలంలో విద్యార్థులకు మెటీరీయల్ పంపిణీ చేసేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మెటీరీయల్ పంపిణీ చేస్తామన్నా.. ఇప్పటి వరకు విద్యార్థులకు అందలేదు. దీంతో ప్రావీణ్యత కలిగిన ఉపాధ్యాయులు తయారు చేసిన స్టడీ మెటిరీయల్‌ను ఉపాధ్యాయ సంఘాల నాయకులు అయా పాఠశాలల్లో ఉచితంగా పంపిణీ చేసి విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

**247 పాఠశాలలు..**
**18,635 మంది విద్యార్థులు**

ఆదోని, పత్తికొండ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 247 ఉన్నాయి. అయా పాఠశాలల్లో 18,635 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. అందులో ఆదోని డివిజన్‌లోని ప్రభుత్వ, ఎయిడెడ్, పురపాలక, గురుకులం, కస్తూర్బా, మోడల్ పాఠశాలల్లో 10,076 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. పత్తికొండ ప్రాంత్రం 6,245 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

**గడిచిపోయిన 58 రోజులు ..**

మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్షలకు రాయడానికి విద్యార్థులకు 42 రోజులు మాత్రమే మిగిలింది. ‘మెరుగైన ఫలితాల సాధన దిశగా వంద రోజులు ప్రణాళిక సిద్ధం చేశాం.. విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ పంపిణీ చేస్తామని’ ప్రభుత్వం పేపర్లలో ఆర్భాటంగా ప్రకటన చేస్తోంది. దీంతో మెటీరియల్ అప్పుడు వస్తుంది... ఇప్పుడు వస్తుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. అయితే వంద రోజుల్లో 58 రోజులు గడిచిపోయాయి, ఇంకా మిగిలింది 42 రోజులు మాత్రమే. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరీక్షలకు రెండు మూడు నేలలకు ముందే విద్యాజ్యోతి పేరుతో ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను రూపొందించి పిల్లలకు పంపిణీ చేసేది. ప్రస్తుత వంద రోజుల ప్రణాళికతో పాటు విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ పంపిణీ చేయాల్సి ఉన్నా ఇంతవరకు అందజేయలేదు. పంపిణీ చేస్తే సగటు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో పాటు మంచి మార్కులను పొందడానికి ఎంతగానో దోహదపడేది.

**విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం**



పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఉదయం, సాయంత్రం వేళల్లో పత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. వాట్సప్‌లో వచ్చిన పీడీఎఫ్ ఫైల్‌ను డౌన్‌లోడు చేస్తుకొని విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మెటిరీయల్ పంపిణీ చేస్తామన్నారు, కానీ.. ఇంకా రాలేదు. ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు కొంత మంది దాతలు స్పందించి మెటీరీయల్‌ను అందించారు.
**– వెంకటరమణా రెడ్డి, ఉప విద్యాధికారి, ఆదోని**

**ఉపాధ్యాయ సంఘాల చేయూత..**

ఉపాధ్యాయ సంఘాల నాయకులే దాతల ద్వారా అయా పాఠశాలల్లో ఉచితంగా విద్యార్థులకు స్టడీ మెటీరీయల్‌ను పంపిణీ చేయించారు. ప్రత్యేకంగా రూపొందించిన ఆ స్టడిమెటీరీయల్‌తో పాటు ప్రభుత్వం రూపొందించిన పీడీఎఫ్ ఫైల్‌ను ఉపాధ్యాయులు డౌన్‌లోడు చేసుకొని విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ ప్రణాళిక ప్రకారం ప్రతి రోజూ విద్యార్థులకు అసైన్‌మెంట్స్, మాక్ టెస్టులు పెడుతూ ఉదయం 8.15 నుంచి 9.15 గంటల వరకూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. రోజుకు ఒక సబ్జెక్టు చొప్పున వారంలో 5 సబ్జెక్టులకు బోధన అందించి రివ్యూ చేస్తున్నారు.

### వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

**మంత్రాలయం :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఆయా విభాగాల అధ్యక్షలను ప్రకటించింది. మంత్రాలయం నియోజవర్గంలో యూత్ కమిటీ అధ్యక్షుడిగా నరవ రాజశేఖర్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా బళ్లారి సావిత్రి, రైతు సంఘం కేపీ యల్లప్ప, బీసీ సెల్ నాడిగేని నాగరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మాదిగ జయపాల్ నియమితులయ్యారు. ఎస్టీ సెల్‌కు జి.లక్ష్మన్న నాయక్, మైనార్టీ సెల్‌కు కటిక షాబుద్దీన్, క్రిష్టియన్ మైనార్టీ వింగ్‌కు చాగి ఈరప్ప, స్టూడెంట్స్ విభాగానికి డి.మహబూబ్, పంచాయతీరాజ్ విభాగానికి అధ్యక్షుడిగా పి.ఈరన్నలను పార్టీ నియమించింది. ఆర్‌టీఐ విభాగానికి డి.ఖాజా హుస్సేన్, వలంటీర్స్ వింగ్‌కు జాము వీరేష్, గ్రీవెన్స్ విభాగానికి ఎస్‌స్కే గోపాల్‌రావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా జి.భీమారెడ్డిని ఎంపిక చేశారు. చేనేతల విభాగానికి రామాంజినేయులు, వైఎస్సార్‌టీయూసీ విభాగానికి కాలప్ప, అంగన్‌వాడీ విభాగానికి లక్ష్మి నరసమ్మ, లీగల్ సెల్‌కు వీరభద్రగౌడ్, సాంస్కృతిక విభాగానికి వడ్డె నారాయణ, సోషియల్ మీడియా విభాగం గూళ్యం గౌతమ్ రాజ్, ఐటీ విభాగానికి హనుమంతరెడ్డి, దివ్యాంగుల విభాగానికి షేక్షావలి, డాక్టర్స్ విభాగం దశరథరెడ్డి, ఇంటెలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, బూత్ కమిటీలకు బాపురం చంద్రశేఖర్ రెడ్డి, ప్రచార విభాగం ప్రెసిడెంట్‌గా ముక్కరన్న ఎంపికయ్యారు.

## రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ స్థల పరిశీలన



ఐరన్‌గల్ వద్ద రైల్వే బ్రిడ్జి నిర్మాణ స్థల పరిశీలన చేస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

**ఆదోని రూరల్/ కోసిగి:** ఆదోని, కౌతాళం మండలాల సరిహద్దుల్లో ఉన్న కుప్పగల్ వద్ద, కోసిగి మండల పరిధిలోని ఐరన్‌గల్లు గ్రామ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టేందుకు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ స్థల పరిశీలన చేపట్టారు. బుధవారం ఆదోని, కౌతాళం, కోసిగి రెవెన్యూ, రైల్వే అధికారులతో కలిసి స్థలాలను పరిశీలించారు. రైల్వే పట్టాల ప్రాంతంలో రైతులకు ఆయా గ్రామాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తహసీల్దార్లు శివరాముడు, రజనీకాంత్‌రెడ్డి, రుద్రగౌడ, రైల్వే ఇంజనీర్ ఉమాపతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య ఉన్నారు.

**రీసర్వే పకడ్బందీగా చేపట్టండి**

**కోసిగి:** మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో పకడ్బందీగా రీసర్వే పనులు చేపట్టాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. బుధవారం చింతకుంట గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను పరిశీలించారు. సీనియర్ సహాయకులు తిక్క స్వామి, మండల సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## ఆక్రమణల తొలగింపు



రైల్వేస్టేషన్ రోడ్డులో జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

**ఆదోని టౌన్:** పట్టణ అభివృద్ధిలో భాగంగా బుధవారం రైల్వేస్టేషన్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. టీపీఓ బాలమద్దయ్య, ఏసీపీ క్రిష్ణసింగ్, వార్డు ప్లానింగ్ సెక్రటరీ రాజేశ్వరితో పాటు ఉద్యోగులు అక్రమ కట్టడాలను తొలగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డు, ద్వారకా టాకీస్ రోడ్డు ప్రాంతాల్లోని అక్రమ కట్టడాలను జేసీబీతో తొలగించారు. మున్సిపల్ స్థలాలను ఆక్రమించినా, భవంతులను నిర్మించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు హెచ్చరించారు. ప్రధాన కూడళ్ల, రోడ్లలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసినట్లయితే వెంటనే తొలగిస్తామని కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు.

### నేటి నుంచి గోపుర కలశ పూజలు



నూతనంగా నిర్మించిన ఆలయ గోపురం

**కోసిగి:** మండల కేంద్రం కోసిగిలో పద్మశాలి కుల బాంధవుల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో గురువారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నూతన గోపుర శిఖర కలశ పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో నూతనంగా గర్భగుడి గోపురం, మహాద్వార గోపురము నిర్మించారన్నారు. ఆలయ కమిటీ పద్మశాలి భక్తుల ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు ఉంటాయన్నారు. 31న దేవాలయ ప్రధాన దేవ సహిత శిఖర దేవతలకు రుద్రాభిషేకం, మహాస్తవనము, మహాసుదర్శన హోమము, లక్ష్మీహోమము, ఫిబ్రవరి 1వ తేదిన పార్వతీపరమేశ్వరల కళ్యాణం, 2వ తేదీ వేకువ జామున 4.45 గంటల నుంచి గోపుర శిఖరములకు కలశ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అత్యధికలో పాల్గొని విజమవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## అర్హుల పింఛన్లను తొలగిస్తే ఊరుకోం



మాట్లాడుతున్న హనుమంతరెడ్డి

**ఆదోని రూరల్:** వెరిఫికేషన్ పేరుతో అర్హుల పింఛన్లను తొలగిస్తే సహించేది లేదని ఆదోని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల మండలాధ్యక్షుడు హనుమంత రెడ్డి అన్నారు. బుధవారం ఆయన అర్హులైన పింఛన్‌దారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాల హయాంలో సదరం క్యాంపుల ద్వారా వికలాంగుల ధ్రువీకరణ పత్రం పొంది, పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులకు వెరిఫికేషన్ చేయాలనే పేరుతో నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. ఈ ప్రయత్నాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో రూ.3 వేలు ఉన్న పెన్షన్ రూ.6 వేలకు పెంచుతానని హామీ ఇచ్చి, ఇప్పుడు అర్థంతరంగా విచారణ పేరుతో ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకోవాలి



గోనెగండ్లలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ జి. భాస్కర్, డీఎల్‌పీఓ నూర్జహాన్

**గోనెగండ్ల :** గ్రామంలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డిని నిర్మించుకొని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకోవాలని డీపీఓ జి.భాస్కర్ ప్రజలకు సూచించారు. బుధవారం మండలం కేంద్రం గోనెగండ్లలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆదోని డీఎల్‌పీఓ నూర్జహాన్‌తో కలిసి తనిఖీ చేశారు. గ్రామంలో ఇంటి, కొళాయి తదితర పన్నులు, తాగునీటి క్లొరినేషన్, చెత్త సేకరణ, గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను గూర్చి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డీపీఓ మాట్లాడుతూ గ్రామాన్ని ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామంగా ఎంపిక చేయడం జరిగింది. గ్రామంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. గ్రామంలోని సేకరించిన చెత్తను షెడ్డుకు తరలించాలి. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో తయారు చేసిన ఎరువులను రైతులకు విక్రయించి సంపద సృష్టించే విధంగా చేయాలని సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంతసేన, ఇన్‌చార్జ్ ఈఓ సతీష్, సర్పంచ్ హైమవతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మిరపకు నాణ్యత పరీక్షలు చేయించాలి

**ఎమ్మిగనూరురూరల్:** రైతులు పండించిన మిరప కాయలకు నాణ్యత పరీక్షలు చేయిస్తే మంచి ధరకు విక్రయించుకోవచ్చని డిటిజల్ గ్రీన్ సీనియర్ రిజనల్ కో–ఆర్డినేటర్ వెంకట్‌గౌడ్, కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మిర్చి నాణ్యత పరీక్షలపై డేటా ఆఫీసర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నాణ్యత పరీక్షల్లో మిరప నాణ్యత ఘాటు, రంగు, తేమ శాతము తెలిపే పరికరాలు బనవాసి కేవీకేలో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ డీపీఎం కుమారస్వామిరెడ్డి, ఆర్డీప్, అపార్డ్ సంస్థల ప్రతినిధిలు పాల్గొన్నారు.

### సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాల్సిందే

**ఆదోని సెంట్రల్:** ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాల్సిందేనని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వీరేష్, కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేదని చెప్పి పథకాలను అమలు చేయక పోవడం సరికాదన్నారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం అని, ఇప్పటి వరకు నోటిఫికేషన్ కూడా జారీ చేయలేదన్నారు. తక్షణమే స్పందించి విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ పోస్టులను, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలన్నారు.

### బస్టాండులో మరుగుదొడ్లను ప్రారంభించండి

**కౌతాళం:** మండల కేంద్రమైన కౌతాళంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లను ప్రారంభించాలని ఎమ్మార్పీఎస్ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆదోని ఆర్టీసీ డిపో అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం టౌన్ అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ మరుగుదొడ్లను కట్టించినా వాటిని వినియోగించడం లేదన్నారు. అవి నిరుపయోగం ఉన్నందున పక్కన ఉన్న ఖాళీ స్థలంలో మూత్ర విజర్జన చేస్తుండటం వల్ల ప్రయాణికులు ఇబ్బందులకు గురి అవుతున్నారని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తొందరగా టెండర్లు పిలిచి వాటిని ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఉలిగప్ప, ప్రధాన కార్యదర్శి రాము, శివ, చిదానందలు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు అభినందనలు



ప్రతిభ చూపిన రాజు

**ఆదోని సెంట్రల్:** విశాఖపట్టణ అంకపాలెంలో ఈనెల 25 నుంచి 71వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చూపిన ఆదోనికి చెందిన క్రీడాకారులను కోచ్ హరిబాబు, పెద్దహరివాణం ఉన్నత పాఠశాల పీడీ రామన్న బుధవారం అభినందించారు. వారు మాట్లాడుతూ.. పోటీల్లో జిల్లా జట్టు మూడో బహుమతి సాధించగా.. ఆదోనికి చెందిన రాజు, అవినాష్ తమ ప్రతిభ చాటి జట్టు గెలుపునకు కృషి చేశారన్నారు.

### మందకృష్ణకు పద్మశ్రీ అవార్డుపై హర్షం

**గోనెగండ్ల :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహదేవ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగేష్, తిక్కన్న, పేతురు, మాదన్న, నరసింహులు, లిక్కన్న, సీమోన్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా దర్గా ముఖద్వారం ప్రారంభోత్సవం



ముఖద్వారం ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి

**మంత్రాలయం :** మండల పరిధిలోని వగరూరు గ్రామంలో శ్రీ దస్తగిరి స్వామి దర్గా ముఖద్వారం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. బుధవారం గ్రామంలో భక్తులు ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించి ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి హాజరయ్యారు. అలాగే ఏపీ మైనార్టీల ప్రభుత్వ సలహాదారుడు షరీఫ్ పాల్గొన్నారు. గ్రామస్తులు వారికి స్వాగతం పలికి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఉరుకుందలో లక్ష పుష్పార్చన



స్వామికి లక్ష పుష్పార్చన పూజలు చేపడుతున్న అర్చకులు

**కౌతాళం:** జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆధ్వర్యంలో బుధవారం లక్షపుష్పార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు ఈ పూజల్లో పాల్గొని భక్తిని చాటుకున్నారు. ప్రతి అమావాస్యకు ఇలాంటి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఈఓ చెప్పారు. పుష్పార్చన పూజల్లో పాల్గొనలనుకున్న భక్తులు తమ పేర్లను ముందుగానే దేవాలయ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

**భక్తుల సందడి**

అమావాస్య ఉండడంతో భక్తులు తమ ఇంటి ఇలావేల్పును దర్శించుకోవాడానికి వేలాదిగా మంగళవారం సాయంత్రం నుంచే తరలివచ్చారు. దేవాలయ పరిసర ప్రాంతాలన్నీ సందడిగా మారాయి. దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. అలాగే ఉరుకుంద సమీపంలో వెలసిన బుడుములదొడ్డి ఆంజినేయస్వామి ఆలయంలో,తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య వేడుకలకు భక్తులు అధికంగా తరలివచ్చారు.

### వలసలొద్దు.. పనులు కల్పిస్తాం



కనకవీడులో ఉపాధి పనులపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ పుల్లయ్య

**నందవరం :** వలస వెళ్లొద్దు.. గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి, పనికి తగిన వేతనం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ పుల్లయ్య సూచించారు. బుధవారం మండల పరిధిలోని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ అల్లిపీర ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కల్పించి, కచ్చితమైన కొలతలతో పనిచేస్తే రోజు వారి వేతనం రూ.300 చెల్లించేలా చర్యలు చేపడతామని వివరించారు. గ్రామంలో ఫారంపాండ్ పనులు, పూడిక తీత పనులు చేపడతామన్నారు. రైతులు, వ్యవసాయ, ఉపాధి కూలీలు గ్రామీణ ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలోనే ఉంటూ ఉపాధి పనులను వినియోగించుకోవాలని, పిల్లలను బాగా చదివించుకోవాలని మండల విద్యాధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సందీప్, ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, టీఏలు, ఎఫ్‌లు తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధి పనులు కల్పిస్తాం**

**గోనెగండ్ల:** గ్రామంలోనే ఉపాధి హామీ పనులు కల్పిస్తాం, ఎవరూ కూడా వలసలకు వెళ్లొద్దని ఎంపీడీఓ మణి మంజరి సూచించారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని కున్నూరు గ్రామంలో గ్రామస్తులకు ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన వారందరికీ గ్రామంలోనే ఉపాధి హామీ కింద 150 రోజుల పనిదినాలు ఉంటాయి. కార్యక్రమంలో ఏపీఓ మహబూబ్ బాషా, ఈసీ ఉస్మాన్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి నాయకుల అత్యుత్సాహం



తమ స్థలంలో గోడ నిర్మించారని చూపుతున్న బాధితులు

**పెద్దకడబూరు :** కాంపౌండ్ వాల్ పేరుతో కూటమి నాయకులు వైఎస్సార్ సీపీ కార్యకర్తల స్థలాలను కాజేసేందుకు యత్నిస్తున్నారు. మండల పరిధిలోని నౌలుకల్లు గ్రామంలో గతంలో 63 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. కాగా కాలనీలో మిగులు స్థలంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నిర్మించింది. ప్రస్తుతం ప్రభుత్వం వాటికి ప్రహరీల నిర్మాణానికి అనుమతి లభించింది. ఇదే అదునుగా భావించిన కూటమి తమ్ముళ్లు ప్రభుత్వ స్థలంతో పాటు పక్కనే ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తల స్థలాన్ని కూడా కలుపుకొని కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. లబ్ధిదారులు ఈ విషయాన్ని తహసీల్దారు శ్రీనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన నుంచి సరైన స్పందన లేకపోవడంతో లాయర్‌ను ఆశ్రయించి నోటీసులు పంపించారు. అయినా కూడా కూటమి నాయకులు లెక్కచేయకుండా తమపని కానిచ్చేశారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ పీఆర్ ఏఈ మల్లయ్యను వివరణ కోరగా రెగ్యులర్ తహసీల్దారు ఇచ్చిన రికార్డు పరంగానే గోడ కడుతున్నట్లు తెలిపారు. లాయర్ నోటీసులు అందాయని తెలిశాక వివాదం తొలగేంత వరకు కట్టడాలను నిలిపివేయాలని కాంట్రాక్టర్‌కు సూచించినట్లు వెల్లడించారు.